చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తాగినడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మవోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పాగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేది?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

విజయవంతం చేయాలి

జగిత్యాల, డిసెంబర్ 5: కోరుట్లలో ఈనెల 8న సీపీఎం జిల్లా 3వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు పుప్పాల శ్రీకాంత్ తెలిపారు. జగిత్యాలలోని పార్టీ కార్యాలయంలో గురువారం సీపీఎం జిల్లా నాయకుడు సురేశ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభలకు జిల్లాలోని ప్రజలు, ప్రముఖులు, కార్మికులు, రైతులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు గర్వందుల రమేశ్, చంద్రయ్య, మల్యాల సురేశ్, బొర్ర శేఖర్, రఫిక్, బుగ్గయ్య, సుజాత, లావణ్య, కవిత, సుజాత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు మనక్

జగిత్యాల టౌన్, డిసెంబర్ 5: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు మనక్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాము, జిల్లా సైన్స్ ఆఫీసర్ మచ్చ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, శాస్త్రీయ ధృక్పథంతో ఉన్న ఆలోచనలతో భావి శాస్త్రవేత్తలను తయారు చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. మొత్తం ప్రదర్శనల నుంచి 10 శాతం మేరకు నమూనాలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని వెల్లడించారు. మొదటి రోజు కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలోని ఉన్నత పాఠశాలలు, రెండో రోజు జగిత్యాల డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. అంశాల వారీగా విద్యార్థులు, గైడ్ టీచర్ సమయానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలకు వస్తున్న అధికారులు

గురుకుల పాఠశాల తనిఖీ

మేడిపల్లి, డిసెంబర్ 5: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విధానం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, కూరగాయలు, ఆహార పదార్థాలు నిల్వ చేసిన గదిని తనిఖీ చేశారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణిస్తుండగా, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, గాజుల నిరంజన్, ఉపాధ్యాయులను అభినందించారు.

హ్యాండ్‌బ్యాగు నుంచి బంగారం, నగదు చోరీ

మెట్‌పల్లి, డిసెంబర్ 5: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ హ్యాండ్‌బ్యాగు నుంచి బంగారం, నగదు చోరీకి గురైంది. బాధితురాలి కథనం ప్రకారం.. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గుగ్లిళ్ల నిరోష కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జరిగే ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. సాయంత్రం మార్గమధ్యంలో మెట్‌పల్లి బస్టాండులో అల్పాహారం చేసేందుకు బస్సు దిగింది. అల్పాహారం చేసిన అనంతరం కమ్మర్‌పల్లి వెళ్లేందుకు బస్సు ఎక్కే క్రమంలో హ్యాండ్‌బ్యాగులోని నాలుగు తులాల బంగారు నగలు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి జువ్వాడికి లేదు

మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు

మెట్‌పల్లి, డిసెంబర్ 5: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ని విమర్శించే అర్హత, స్థాయి కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుకు లేదని బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు బంగారు కాళ్ల కిశోర్, అంగడి పురుషోత్తం పేర్కొన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడిన దాంట్లో తప్పేముందని, సంవత్సర కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని, ప్రజల్లోనూ వ్యతిరేకత తీవ్రంగా ఉందని వివరించారని అన్నారు. సీఎంను విమర్శిస్తే ఊరుకునేది లేదని కృష్ణారావు బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయించాలన్నారు. మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన భవన నిర్మాణం, రోడ్లు, ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణాల పూర్తికి సహకరించాలని డిమాండ్ చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అప్పటి సీఎం కేసీఆర్ నంబర్ వన్ స్థానంలో నిలబెట్టారని కొనియాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పీసు తిరుపతిరెడ్డి, మేడిచెల్మెల నాని, మెండె రమేశ్, ఒజ్జెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వెల్గటూర్, డిసెంబర్ 5: వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లిలో ఈనెల 2న అన్నను హత్య చేసిన తమ్ముడితో పాటు మరొకరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుమ్మరిపల్లికి చెందిన అన్నదమ్ములు బొమ్మెన సుమన్, డిల్లేశ్‌కు వారసత్వంగా వచ్చిన 36 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించగా, బయానా రూపంలో రూ. 2.60 లక్షలు ఇచ్చాడు. కాగా, ఆ డబ్బులు ఢిల్లేశ్ ఒక్కడే తన సొంతానికి వాడుకున్నాడు. దీంతో అందులో తనకు కూడా వాటా వస్తుందని సుమన్ తాగి వచ్చి గొడవ చేస్తుండేవాడు. ఈ క్రమంలో అన్నను హత్య చేసినట్లైతే భూమి అమ్మగా వచ్చిన డబ్బులు తనకే దక్కుతాయని భావించిన డిల్లేశ్ తన స్నేహితుడైనా పోతన సురేందర్(వంజరి) సహాయం కోరగా ఒప్పుకున్నాడు. కాగా, ఈ నెల 2న రాత్రి 11 గంటల ప్రాంతంలో సుమన్‌ను కత్తితో పొడిచి హత్య చేసి పారి పోయారు. సుమన్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారు హత్యకు ఉపయోగించిన కత్తి, పారిపోవడానికి వాడిన బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, వెల్గటూర్, బుగ్గారం ఎస్ఐలు ఉమాసాగర్, శ్రీధర్‌రెడ్డి, ఏఎస్ఐ మామిడిపల్లి శ్రీనివాస్, పీసీలు ఎండీ ఆదిల్‌షా, కిరణ్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

భూసేకరణను నిలిపివేయాలి

- రైతుల ఏకగ్రీవ తీర్మానం
- గ్రామాల్లో గ్రామసభల బహిష్కరణ

మేడిపల్లి, డిసెంబర్ 5: కథలాపూర్ మండలం కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు నుంచి కుడి కాలువ నిర్మాణానికి భూసేకరణను నిలుపుదల చేయాలని భీమారం మండలం దేశాయిపేట, లింగంపేట, భీమారం గ్రామాల్లో రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆయా గ్రామాల్లో గురువారం కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు నుంచి కుడి కాలువ నిర్మాణం కోసం భూసేకరణ నిమిత్తం తహసీల్దార్ రవికిరణ్, ఆర్ఐలు రాజారాం, కిరణ్‌కుమార్ గ్రామసభ నిర్వహించగా, ముంపుబాధిత రైతులు గ్రామసభలను బహిష్కరించారు. భూసేకరణను నిలుపుదల చేసి, ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ వరద కాలువ పునర్జీవ పథకం కింద ఎత్తిపోతల ద్వారా చెరువులను నింపుతామని గతంలో వరద కాలువ ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపి సస్యశ్యామలం చేయాలని సర్వే చేయించారన్నారు. కుడి కాలువ భూసేకరణ నిలుపుదల చేసి గత ప్రభుత్వం వరదకాలువ పునర్జీవ పథకం ద్వారా చేసిన సర్వే ప్రకారం చెరువులను నింపాలన్నారు. భూసేకరణలో చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోతున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, నాయకులు చెక్కపెల్లి రఘు, బుడుత శ్రీనివాస్, చెన్నమనేని అజిత్‌రావు, సాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో గ్రామసభను బహిష్కరించి ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎమ్మెస్సీలో మెట్‌పల్లి విద్యార్థి ప్రతిభ

అందుకున్న అవార్డులతో వర్షారెడ్డి

మెట్‌పల్లి, డిసెంబర్ 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన న్యాయవాది ఏలేటి నరేందర్‌రెడ్డి-వందన దంపతుల కూతురు వర్షరెడ్డి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని వ్యవసాయ సాంకేతిక పరిశోధనా స్థానంలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ కోర్సు పూర్తి చేసింది. కోర్సులో అత్యుత్తమ ప్రతిభ చూపి రెండు బంగారు పతకాలను సాధించింది. భువనేశ్వర్‌లోని వ్యవసాయ సాంకేతిక పరిశోధన స్థానంలో గురువారం జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ రఘువర్ దాసు, ఒడిశా డిప్యూటీ సీఎం వర్ధన్ సింగ్, వీసీ ప్రభాత్‌కుమార్ చేతుల మీదుగా వర్షరెడ్డి బంగారు పతకాలు, ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. వర్షరెడ్డిని పలువురు అభినందించారు.

పొలంబాట కార్యక్రమంపై అవగాహన

రేచపల్లిలో పొలంబాట కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్, డిసెంబర్ 5: రైతులు వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఏడీఈ సింధూశర్మ సూచించారు. రేచపల్లి గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యుత్ సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలన్నారు. వార్షిక వ్యవసాయ బిల్లులను సమయానికి చెల్లించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్, మాజీ ప్రజాప్రతినిధులు ఎడమల జయ-లక్ష్మారెడ్డి, భుక్యా లావణ్య-రాథోడ్, మోత్కూరి ప్రసాద్ గౌడ్, ఎండీ ఇబ్రహీం, అజ్మీర శ్రీలత- శ్రీనివాస్, బేర మహేశ్, మల్లేశం, ప్రవీణ్, విద్యుత్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

బీర్‌పూర్‌లో భూసార పరీక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్, డిసెంబర్ 5: పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల వ్యవసాయాధికారులు ప్రదీప్ రెడ్డి, రాజ్‌కుమార్ సూచించారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో గురువారం నేల సంరక్షణపై రైతులకు వ్యవసాయాధికాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంట మార్పిడి చేసుకోవాలని, కొయ్య కాలు తగలబెట్టకుండా కలియదున్నాలని రైతులకు వివరించారు. ఆయా రైతు వేదికల్లో ప్రాజెక్టర్ ద్వారా నేల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు ఆంజనేయులు, వెంకటేశ్, వినోద్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల టవర్ సర్కిల్, డిసెంబర్ 5: దరూర్ క్యాంపులోని కస్తూర్బా విద్యాలయంలో